క్లుప్తంగా

ఫుట్‌బాల్ టోర్నీ విజేత లేపాక్షి జట్టు


ప్రతిభ చాటిన లేపాక్షి జట్టు

లేపాక్షి: హిందూపురం పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అండర్–16 బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలు అనంతపురం రూరల్ డెలప్‌మెంట్ ట్రస్ట్ వారు నిర్వహించారు. లేపాక్షి జట్టు ఫైనల్‌లో హిందూపురం టౌన్ జట్టుపై విజయం సాధించింది. లేపాక్షి జట్టులో పులమతి విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే అండర్–18 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో లేపాక్షి జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. విజేత జట్టు సభ్యులను ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

యువకవికి అరుదైన గౌరవం


అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన యువకవి చంద్రశేఖర్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆదివారం అనంతపురం పట్టణంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో రాయలసీమ మహాకవి సమ్మేళనం నిర్వహించారు. అనంతపురం కవుల సమ్మేళనంలో స్వీయ కవితాగానం చేసిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు, శ్రీ శేఖర్ ట్యూషన్ అకాడమి డైరెక్టర్ చంద్రశేఖర్‌కు కళావేదిక తరపున ప్రముఖ కవి సడ్లపల్లి చిదంబరరెడ్డి ఆత్మీయ సన్మాన పురస్కారాన్ని అందజేశారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

లేపాక్షి: సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని నంది విగ్రహం ఆవరణలో ఆదివారం సీఐటీయూ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతు కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేసి న్యాయమైన డిమాండ్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజప్ప, సభ్యులుగా రాధమ్మ, పద్మక్క, పార్వతమ్మ, నాగరత్నమ్మ, ధనమ్మ, మాధవి, జయసుధ తదితరులు ఎన్నుకున్నారు.

అన్నమ్మ దేవతకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న చైర్మన్

లేపాక్షి: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు మహాసంస్థానం గ్రామదేవత అన్నమ్మదేవతకు చోళసముద్రం టోల్‌గేట్ వద్ద ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, కుటుంబ సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించి, విగ్రహం వద్ద బలిదానం చేశారు. అనంతరం అమ్మవారిని మంగళ వాయిద్యాలు, తప్పెట్లతో ఊరేగింపుగా చౌడేశ్వరిదేవి ఆలయం వద్దకు వెళ్లారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

షాపులో చోరీ

సోమందేపల్లి: స్థానిక సప్తగిరి కాలనీలో ఓ దుకాణంలో చోరీ జరిగినట్లు బాధితురాలు మంజుళ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. శనివారం షాపు షట్టర్ ధ్వంసం చేసి 10 సిగరెట్ ప్యాకెట్లు, రూ.4 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో తెలిపింది.

కంప చెట్ల తొలగింపు


హరేసముద్రంలో గుంతలకు మట్టి వేయిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల సందర్భంగా భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కరియన్న తెలిపారు. ఆదివారం మడకశిర మెయిన్ రోడ్డు నుంచి హరేసముద్రం మీదగా భక్తరపల్లి వరకు కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టామన్నారు. సోమవారం జరిగే జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అదే విధంగా గ్రామాల్లో తాగునీరు, వీధిదీపాల సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు

- యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
- పచ్చదనం తరిగిపోతున్నా పట్టించుకోని అధికారులు
- నిద్రమత్తులో అటవీశాఖ అధికారులు
- పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదం


పెద్దగువ్వలపల్లి వద్ద వందల ఎకరాల్లో నరికేసిన నీలగిరి చెట్లు


ట్రాక్టరులో అక్రమంగా తరలిపోతున్న కలప

రొద్దం: పచ్చదనం కాపాడుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని ప్రతి సందర్భంలో ప్రచారం చేస్తున్నా.. కొందరు స్వార్థపరులు పచ్చని చెట్లను నరికి, యథేచ్ఛగా కలప అక్రమంగా రవాణా చేస్తూ వ్యాపారం చేస్తున్నారు. అటవీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కలప అక్రమ రవాణాపై నామ మాత్రపు చర్యలు చేపడుతుండడంతో కొత్త మార్గంలో వ్యాపారం కొనసాగిస్తున్నారు.

మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు, వంకల్లో ఏపుగా పెరిగిన పచ్చదనంపై గొడ్డలి వేస్తున్నారు. గత ప్రభుత్వాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం, గ్రామ ఆయా వనురులను సమకూర్చేందుకు చెరువుల్లో జాలి మొక్కలు నాటించాయి. ఇవి ప్రస్తుతం వృక్షాలై అడవిని తలపిస్తున్నాయి. వీటిపై కొందరు కలప అక్రమ వ్యాపారుల కన్నుపడింది. ఆలస్యం చేయకుండా రాత్రి వేళల్లో చెట్లను నరికి మూడో కంటికి తెలియకుండా గుట్టుగా కలప కర్ణాటకకు తరలిస్తున్నారు. విషయాన్ని అటవీశాఖ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు తెలియజేసినా వారు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పెద్దగువ్వలపల్లి గ్రామ సమీపంలో వందల ఎకరాల్లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఖరీదైన నీలగిరి చెట్లను నరికేసి, అక్రమంగా రాత్రికి రాత్రే లారీల్లో కర్ణాటకకు తరలించి, కొందరు సొమ్ము చేసుకున్నారు. చెట్లను నరికిన వారిని గుర్తించి, ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కలప అక్రమ రవాణాతో రూ.లక్షలు సంపాదిస్తున్నట్లు గ్రామాల్లో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించాల్సిన అవసరం ఉంది. అక్రమ రవాణాకు అడ్డకట్ట వేయాలని ప్రజలుకోరుతున్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



మండలంలో కలప అక్రమ రవాణా సాగుతోంది. ఎక్కడి చెట్లు అక్కడ నరికేసి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పచ్చదనంపై గొడ్డలి వేటు పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి కలప అక్రమ రవాణా అడ్డుకుని పచ్చదనాన్ని కాపాడాలి.

– రవిశేఖర్‌రెడ్డి, రొద్దం

చర్యలు తీసుకోవాలి



పచ్చదనాన్ని హరిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అనుమతులు లేకుండా అక్రమార్కులు భారీ చెట్లను నరికేస్తున్నారు. చెట్లను కాపాడుకోకుంటే భావితరాలకు పర్యావరణ ముప్పు తప్పదు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కలప రవాణాను అడ్డుకోవాలి.

– లోకేష్, సామాజిక సేవాకర్త, రొద్దం

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి


అలంకరణలో గురు దత్తాత్రేయ స్వామి

అగళి: మండల పరిధిలోని ఎంఎం పాళ్యం గ్రామంలో ఆదివారం గురు దత్తాత్రేయ స్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నాగరాజు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కాగడ హారతి, పంచామృతాభిషేకాలు, సామూహిక క్షీరాభిషేకం, మహా మంగళహారతి చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గురు దత్తాత్రేయ స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

భంభం బాబాకు పూజలు


అలంకరణలో భంభం బాబా చిత్రపటం

పావగడ: పట్టణంలోని ఆదర్శ నగర్‌లో వెలసిన కంఠేశ్వర, సద్గురు భంభం బాబా దేవాలయం అలాగే తుమకూరు రోడ్డులోని సద్గురు భంభం అన్నదానంద బాబా దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలో ఉదయం ధ్యానం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మహా మంగళారతి, ప్రసాద వినియోగం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు

హిందూపురం: కురుబల ఆరాధ్య దైవం కనకదాస జయంతి వేడుకలను మండలంలోని తూమకుంటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కురుబ సేవాసంఘం ఆధ్వర్యంలో మహిళలు పూర్ణకుంభాలు తలపై ఎత్తుకుని మంగళ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కనకదాస చిత్రపటం వద్ద పూజలు చేసి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన టి.ఎన్.దీపిక మాట్లాడుతూ భక్త కులవివక్ష వీడి భక్తి మార్గం ద్వారా సన్మార్గంలో నడుచుకోవాలని సమాజానికి కనకదాస స్ఫూర్తి మార్గాన్ని చూపరన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వి శివ, కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా, మహేష్ గౌడ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మన్సూర్‌ఖాన్, తూమకుంట దేవరాజు, చంద్ర, భాను, ఫరూక్, అయాబ్ బేగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


పూర్ణకుంభాలతో మహిళా ర్యాలీలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.ఎన్.దీపిక

రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో కురుబల ఆరాధ్య దైవమైన భక్త కనకదాస జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కనకదాస విగ్రహానికి మహిళలు కలశాలతో ప్రదర్శన చేసి మొక్కులు తీర్చుకున్నారు. కనకదాస చిత్రపటానికి పురువీధుల్లో ఊరేగించారు.

ఘనంగా పాంచ్‌బీబీ దర్గా గంధం వేడుకలు


గంధాన్ని అమ్మవార్లకు సమర్పిస్తున్న ముతవల్లి అలీహుస్సేన్

పెనుకొండ: పట్టణంలో ప్రసిద్ధి గాంచిన పాంచ్ బీబీ దర్గాలో శనివారం రాత్రి గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. దర్గా ముతవల్లి అలీహుస్సేన్ తమ స్వగృహం నుంచి గంధాన్ని తలపై ఉంచుకుని మతపెద్దలు, ఫకీర్లు వెంటరాగా, ఊరేగింపుతో దర్గాకు చేరుకుని గంధాన్ని ఆంచ్‌బీబీ అమ్మవార్లకు సమర్పించారు. మహిళలు, ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గంధం అందించారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు ఇమ్రాన్, ఖాదర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్డం రంగనాథుడి గిరి ప్రదర్శన


ఉత్సవమూర్తులను కొలువుదీర్చిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయలో గిరిప్రదర్శన కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పూలరథంలో కొలువుదీర్చి పూజలు చేసి భక్తులు గోవిందా నామ స్మరణ చేస్తూ గిరి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవింద శర్మ, పట్టణ ప్రముఖులు వెంకటస్వామి, నరసింహులు, మోహన్, తదితర కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరం

పరిగి: యువత మారకద్రవ్యాల వినియోగంతో జీవితాలను నాశనం చేసుకుంటోందని ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని అన్నారు. ఆదివారం మండలంలోని కొడిగెనహళ్లిలో భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో, ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాల నేతృత్వంలో సే నో టూ డ్రగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత వీధుల్లో మత్తు పదార్థాల వినియోగంపై కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అనంతరం కొడిగెనహళ్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌ఐ మాట్లాడారు. కార్యక్రమంలో భగత్ సింగ్ సేవా సమితి కార్యదర్శి కార్తిక్, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సే నో టూ డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

చోళమాంబ దేవికి ప్రత్యేక పూజలు


పుల్లీకుంటలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని పుల్లీకుంట గ్రామస్తులు ఆదివారం చోళమాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారిని అమరాపురం నుంచి తీసుకొచ్చారు. మహిళలు చోళమాంబ దేవికి హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించి, భక్తులకు ప్రసాదం అందజేశారు. రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామం నుంచి అమరాపురం ఆలయం వరకూ తీసుకొచ్చి ఆలయ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో అర్చకులు, పుల్లీకుంట గ్రామస్తులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

హిందూపురం: పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.ఎన్.దీపిక మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ఒకే భాష – ఒకే రాష్ట్రం అనే నినాదంతో 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహాపురుషుడు శ్రీరాములు అని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వి శివ, మండల, టౌన్ కన్వీనర్లు మన్సూర్‌ఖాన్, రాము, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గుడిబండ: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేం. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని శంకరగల్లులో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని తెలుగు ప్రజలు మరవరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పుష్పలత, మాజీ వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సర్పంచ్ అశ్వత్, ఉప సర్పంచ్ ఆశెప్ప, నాయకులు నాగేంద్ర, పాండు, రమేష్, లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


హిందూపురంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టి.ఎన్.దీపిక, నాయకులు

పరిగి: మండలంలో అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీటీ హనుమంతు, ఆర్‌ఐ సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పరిగి గ్రామ సచివాలయంలో సెక్రటరీ నారాయణ ఆధ్వర్యంలో అమర జీవికి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

గోరంట్ల: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలను మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ వీర నారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కన్యక పరమేశ్వరీ ఆలయ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహంవద్దకు పార్టీ శ్రేణులు చేరుకొని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేదర శంకర, ఆర్యవైశ్య సంఘం నాయకుడు సుకుమార గుప్త, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.


గుడిబండలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప


గోరంట్లలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ రూరల్: అమర జీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి ఆర్డీవో ఆనంద్ కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు

ఉరుసుకు భారీగా తరలివచ్చిన జనం


ఉరుసుకు తరలివచ్చిన భక్తులు

పెనుకొండ: పట్టణంలో బాబయ్య స్వామి ఉరుసుకు ఆదివారం భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాలోని నలమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. బాబయ్య స్వామిని దర్శించుకొని ముడుపులు చెల్లించుకున్నారు.

ఉరుసులో తప్పిపోయిన బాలుడు


తప్పిపోయిన బాలుడు

పెనుకొండ: పట్టణంలో జరిగిన బాబయ్య దర్గా ఉరుసులో ముదాపీర్ అనే బాలుడు ఆదివారం సాయంత్రం తప్పిపోయాడు. దీంతో చిన్నారని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది గుర్తించి స్టేషన్ వద్ద ఉంచారు. బాలుడి వివరాలు మైక్‌లో తెలియజేశారు. తల్లిదండ్రులు వచ్చి బాలుడిని గుర్తిస్తే అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

నాగ దేవతల విగ్రహ ప్రతిష్ట


పూజల్లో పాల్గొన్న సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

గుడిబండ: మండల పరిధిలోని శంకరగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన అశ్వర్థుడి కట్టపై ఆదివారం నాగ దేవతల విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. ఉదయం నుంచే స్వామికి మహాగణపతి పూజ, ప్రాణప్రతిష్ట, బలిదానం, మహానైవేదన నివేదనం, పూర్ణాహుతి, ప్రత్యేక హోమం తదితర పూజలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ నాగ దేవతల విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా నాగ దేవతల విగ్రహాన్ని పూలతో అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పుష్పలత, సర్పంచ్ జయమ్మ, మాజీ వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, నాయకులు రమేష్, లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

పెనుకొండ: పెనుకొండ మాజీ సర్పంచ్ శ్రీనివాసులును ఆదివారం సన్మానించారు. పెనుకొండ పంచాయతీని శ్రీనివాసులు ఎంతో అభివృద్ధి చేశారు. ఆయన సేవలను గుర్తించిన దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, జాబిలి చాంద్‌బాషా తదితరులు శ్రీనివాసులుకు దర్గా కమిటీ తరపున ప్రత్యేక సేవా పురస్కారాన్ని అందించారు.


మాజీ సర్పంచ్ శ్రీనివాసులును సన్మానిస్తున్న దర్గా పీఠాధిపతి తదితరులు

నివాళి

హిందూపురం: పట్టణంలోని12వ వార్డు మోడల్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మత పెద్ద ఖాన్‌సాబ్ కుమారుడు మహమ్మద్ ఖాన్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.ఎన్.దీపిక తదితరులు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వి శివ, కౌన్సిలర్ ఆసిఫుల్లా, పార్టీ పట్టణ కన్వీనర్ మన్సూర్ ఖాన్, వార్డు ఇన్‌చార్జ్ సాహెరా బాను, డిష్ చాంద్, అయూబ్ బేగ్, ఫరూక్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బేవినహళ్లి కరియమ్మ జాతర

రొళ్ల: మండల పరిధిలోని జీజీ హట్టి గ్రామంలో సోమవారం నుంచి బుధవారం వరకూ బేవినహళ్లి కరియమ్మ దేవి జాతర నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్లకు ఒకసారి జరిగే జాతరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. శిరా నియోజకవర్గం గొడగెర హోబళి బేవినహళ్లి గ్రామంలో వెలసిన కరియమ్మ దేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా జీజీ హట్టి గ్రామానికి తీసుకువచ్చి ఉత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సోమవారం సాయంత్రం కరియమ్మదేవి ఉత్సవ విగ్రహాన్ని తీసుకువచ్చి గ్రామం నడిబొడ్డున పట్టం కూర్చోబెడతామన్నారు.